సాక్షి ఖమ్మం

ఆదివారం । 1 । జూన్ । 2025



జీవనంలో సగ'పాలు'

జిల్లాలోని పలువురు రైతులు పంటల సాగుకు తోడు పశు పోషణలోనూ రాణిస్తూ పాల ఉత్పత్తి పెంపునకు కృషి చేస్తున్నారు. 8లో



బడులను బలోపేతం చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, కేజీ ప్రవేశపెట్టడం ద్వారా బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి కోరారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీ సేవ చేశారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినుల వసతిగృహంలో ప్రవేశాలు

ఖమ్మంవన్‌టౌన్: మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహిస్తున్న ఉద్యోగినుల వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, సంస్థల్లో పనిచేస్తూ 18 – 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఆర్థికంగా వెనుకబడిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థినులకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ఈమేరకు పుట్టిన తేదీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఉద్యోగ ధ్రువీకరణ లేదా ఉద్యోగ శిక్షణకు సంబంధించిన పత్రం, వేతన సర్టిఫికెట్‌తో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7901017341 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని డీడబ్ల్యూఓ తెలిపారు.

12న అథ్లెటిక్స్ అకాడమీ ఎంపికలు



ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. బాలురకు మాత్రమే అవకాశం ఉండగా, 30 జూన్ 2009 నుంచి 1 జూలై 2011 లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు అకాడమీకి చేరుకోవాలని సూచించారు.

మూడు నెలల బియ్యం పంపిణీకి సిద్ధం



డీలర్లకు సూచనలు చేస్తున్న డీసీఎస్‌ఓ చందన్‌కుమార్

బోనకల్: ఈనెలలో రేషన్‌షాప్‌ల ద్వారా ఒకే సారి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. బోనకల్ మండలంలో పలు రేషన్ షాపులను తహసీల్దార్ రమాదేవి, ఆర్‌ఐ నవీన్ కుమార్, సివిల్ సప్లయీస్ తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో బియ్యం నిల్వ సామర్థ్యం, ఇతర ఏర్పాట్లను పరిశీలించిన డీసీఎస్‌ఓ మూడు నెలల బియ్యం పంపిణీ సజావుగా సాగేలా రేషన్ డీలర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, బియ్యం తీసుకున్న వారు అమ్మితే కార్డు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. డీలర్లు సుంకర రామారావు, బందం అచ్చయ్య, తోట లింగయ్య, వరలక్ష్మి, సత్తార్, నిర్మల, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

3న హెచ్‌ఎంలు, ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 100శాతం నమోదైన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలను సన్మానించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో 3వ తేదీన కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో వంద శాతం ఫలితాలు సాధించిన 66పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు జిల్లా, మండల స్థాయి టాపర్లను సైతం సన్మానించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సత్యనారాయణ తెలిపారు.

పారదర్శకత.. వేగం

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు

- కొత్తగా ఆధార్ ఈ-సంతకం సేవలు
- పైలట్‌గా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- రేపటి నుంచి అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం



ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పౌర సేవలను మరింత వేగవంతం చేయడమే కాక పారదర్శకత పెంపునకు సంస్కరణలు తీసుకొస్తోంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన సంక్లిష్ట ప్రక్రియలను సరళీకృతం చేస్తూ, నూతన విధానాలు అమల్లోకి తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన అధికారులను బదిలీ చేశారు. ఆపై రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధునికీకరించడం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఇకపై ఆధార్ ఈ-సంతకం

పౌర సేవలను సులభతరం చేసేలా ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ-సంతకం సేవల అమలుకు సన్నాహాలు చేస్తోంది. ఇది భౌతికంగా కార్యాలయంలో దస్తావేజులపై సంతకాలు తగ్గించడం, డాక్యుమెంట్లు తయారు చేశాక కార్యాలయానికి వచ్చినప్పుడు మళ్లీ సంతకాలు పెట్టే పని లేకుండా ఉపకరిస్తుందని చెబుతున్నారు. డాక్యుమెంట్లపై డిజిటల్ సంతకాల ద్వారా లావాదేవీలను పూర్తి చేయడంలో సమయం తగ్గి, మానవ జోక్యాన్ని తగ్గించినట్లవుతుందని.. తద్వారా అవినీతికి ఆస్కారముండదని భావిస్తున్నారు. అంతేకాక డిజిటల్ సంతకాలు అత్యంత సురక్షితంగా, ట్యాంపరింగ్‌కు వీల్లేకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు భౌతికంగా వేలిముద్రలు వేసే పని లేకుండా... ఒక వేలి ముద్రను స్కానింగ్ చేస్తే ఆధార్ వెబ్‌సైట్ ద్వారా వారి సదరు వ్యక్తి అన్ని వేళ్ల ముద్రలు ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తాయని.. తద్వారా పని సులువవుతుందని భావిస్తున్నారు.

అన్ని ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీని తగ్గించడం.. పనులు త్వరగా పూర్తయ్యేలా సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలుచేయనున్నారు. ఈ విధానం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు కూసుమంచి, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే కాక రాష్ట్రంలోని ఇంకొన్ని కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతోంది. ఇది విజయవంతమైన నేపథ్యాన స్లాట్ బుకింగ్ విధానాన్ని అన్ని కార్యాలయాలకు విస్తరించనున్నారు. కాగా, ఈ విధానంతో ఆయా కార్యాలయాల్లో సకాలంలో రిజిస్ట్రేషన్లు పూర్తిచేయడంతో పాటు గంటల వ్యవధిలోనే దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అందిస్తున్నారు.

ఉత్తమమైన సేవలు

డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు ఆన్‌లైన్ ద్వారా ముందే తమ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో నిర్దేశిత సమయానికి వస్తే త్వరగా పని పూర్తవుతుంది. ఫలితంగా గంటల తరబడి వేచి ఉండే ఇక్కట్లు తీరినట్లేనని చెబుతున్నారు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం పెరుగుతోంది. ఇలాంటి సంస్కరణలతో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ మరింత చేరువ కావొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

పైలట్ ప్రాజెక్ట్‌గా కూసుమంచి

నూతన విధానం అమలుకు పైలట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలోని రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో జిల్లాలోని కూసుమంచి కార్యాలయం కూడా ఉంది. రెండు కార్యాలయాల్లో ఆధార్ ఈ-సంతకం విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసి, మార్పులు అవసరమైతే చేశాక రాష్ట్రంలోని అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు విస్తరించనున్నారు. కాగా, కూసుమంచిలో ఒకటి, రెండు రోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.



కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



విత్తన దందాపై నజర్

- ఏపీ కేంద్రంగా తయారీ.. జిల్లాకు రవాణా
- అడ్డుకట్ట వేసేలా 14 చెక్‌పోస్టుల ఏర్పాటు
- పాత నేరస్తులపైనా నిఘా



మధిర మండలంలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న వేళ అక్రమార్కులు విత్తన దందాకు తెరలేపారు. రైతుల అవసరాలు, ఆతృతను సొమ్ము చేసుకునేలా రంగంలోకి దిగారు. విత్తన తయారీ, విక్రయాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడ్డాగా నిలుస్తుండగా.. అక్కడ కుటీర పరిశ్రమల మాదిరి నకిలీ విత్తనాలు తయారుచేస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఏపీకి సరిహద్దుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉండడంతో అక్కడి నుంచి విత్తనాలు తీసుకొస్తున్న మధ్యవర్తులు మాయమాటలతో రైతులకు అంటగడుతున్నారు. ఈ నేపథ్యాన రైతులెవరూ మోసపోకుండా వ్యవసాయ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఏపీ అడ్డాగా నకిలీ విత్తన దందా

అధికోత్పత్తుల పేరుతో అక్రమార్కులు నకిలీ విత్తన దందాకు తెగబడుతున్నారు. ఏపీ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణ విత్తనాలనే ఆకర్షణీయమైన ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారు. మైలవరం, మండలం చంద్రుగొండ, తెనాలి, బాపట్ల తదితర ప్రాంతాల్లో అరుణోదయ లేబుల్‌తో రైబోజోల్ మిశ్రమంతో తయారు చేసిన విత్తనాలను మినీ పరిశ్రమల స్థాయిలో తయారుచేస్తున్నారు. ఆపై ఏజెంట్ల ద్వారా విక్రయిస్తున్నారని తెలుస్తోంది..

గుట్టురట్టు చేసిన పోలీసులు

ఏపీ అడ్డాగా సాగుస్తున్న విత్తన దందాను ఖమ్మం పోలీసు యంత్రాంగం గుర్తించింది. జిల్లాలోని ఏన్కూరు, మధిర మండలాలకు ఏపీ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న పత్తి విత్తన ప్యాకెట్లను గుర్తించి.. క్వింటాళ్ల మేర స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్‌కు రూ.901 ధర నిర్ణయించగా... అక్రమార్కులు ఎక్కువ దిగుబడి వస్తుందంటూ రూ.1,200 చొప్పున వరకు విక్రయిస్తున్నారు. ఇక నిషేధిత బీటీ-3 విత్తనాల ప్యాకెట్లు రూ.2,600 వరకు కూడా విక్రయిస్తున్నట్లు తేలింది.



వేంసూరులోని షాప్‌లో విత్తనాలు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య (ఫైల్)

రవాణా విభాగాలు, పాత నేరస్తులపై దృష్టి

జిల్లాలో ఏర్పాటుచేసిన 21 టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృత తనిఖీలు చేస్తున్నాయి. రవాణా సంస్థల గోదాములు, ప్యాకేజీ ఇండస్ట్రీలతో పాటు డీలర్ల గోదాముల్లోనూ తనిఖీలు చేపట్టారు. అంతేకాక గతంలో నకిలీ విత్తన దందాకు పాల్పడిన వారిపై పోలీస్ యంత్రాంగం నిఘా వేసింది. గతంలో కారేపల్లి, కొణిజర్ల, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లో కొందరు అనుమతి లేని పత్తి, మిర్చి విత్తనాలు అమ్మారనే సమాచారంతో వారి కదలికలను పరిశీలిస్తున్నారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు

నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా సరిహద్దులు, టోల్ ప్లాజాల వద్ద వ్యవసాయ, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా 14 చెక్ పోస్టులను ఏర్పాటుచేసింది. ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులతో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం, ముదిగొండ మండలం వల్లభి, వైరా మండలం గన్నవరం(నెమలి క్రాస్ రోడ్), బోనకల్ మండలం వత్సవాయి రోడ్డు, ఎర్రుపాలెం మండలం పెద్దాపురం క్రాస్ రోడ్డు, మధిర మండలం మధిర క్రాస్ రోడ్డు, వేంసూరు మండలం వెంకటాపురం, తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు క్రాస్, కూసుమంచి మండలం పాలేరు (సింగరేణిపల్లి టోల్‌ప్లాజా), వైరా మండలం పాలడుగు, కొణిజర్ల మండలం బస్వాపురం క్రాస్, కల్లూరు మండలం హనుమా తండా, పెనుబల్లి మండలం ముత్తగూడెంలో ఈ చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. చెక్ పోస్టుల వద్దే కాక ఇతర చోట్ల కూడా తనిఖీలు ముమ్మరంగా చేపడుతూ నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్, పీసీసీ చీఫ్‌తో మంత్రి భేటీ

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ శనివారం ఖమ్మం వచ్చారు. భద్రాద్రి జిల్లా కిన్నెరసానిలో జరిగిన ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనంలో పాల్గొన్న వారిని తిరుగు ప్రయాణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని మంత్రి సన్మానించగా.. జిల్లాలో పార్టీ పరిస్థితులు, తదితర అంశాలపై చర్చించారు.

మదన్‌లాల్ కుటుంబానికి పరామర్శ

రఘునాథపాలెం: మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని శనివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మదన్‌లాల్ మృతి చెందగా, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు తుల్లూరి బ్రహ్మయ్య, వాంకుడోత్ దీపక్, బొర్రా రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



మీనాక్షి, మహేష్ కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జవహర్ లిఫ్ట్‌కు సీఓటీ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: సాగర్ ఎడమకాల్వ ద్వారా 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా మధిర మండలం వంగవీడులో నిర్మించనున్న జవహర్ ఎత్తిపోతల పథకం టెండర్లకు కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీఓటీ) ఆమోదం తెలిపింది. ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన సీఓటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రూ. 156.49కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా... 4.85 శాతం హెచ్చింపుతో పీవీఆర్ ప్రాజెక్టు, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ ఉమ్మడిగా దాఖలు చేసిన టెండర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ప్రపంచవ్యాప్తంగా విస్తరణకు చర్యలు

- లాభదాయకమైన టెక్నికల్ మినరల్స్ తవ్వే ఆలోచనలో సింగరేణి
- జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్ ప్రారంభోత్సవాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఏరియా వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన ఎమ్మెల్యే కూనంనేని, సీఎండీ బలరామ్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సింగరేణి సంస్థకు మంచి రోజులు వచ్చాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో సంస్థ పదేళ్లు వెనక్కు వెళ్లిందని, కొత్త గనులు రాకపోవడం, విస్తరణ చేపట్టకపోవడమే దీనికి కారణమని చెప్పారు. కొత్తగూడెంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన వర్క్‌షాప్‌ను, ఆ తర్వాత జీఎం కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలో వీకే – 7 ఓసీకి పర్యావరణ అనుమతులు వచ్చాయని, త్వరలో రెండో దశకు అనుమతులు రానున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చర్యలు చేపడతామన్నారు. 136 సంవత్సరాల ఘన చరిత్ర గల ఈ సంస్థ కేవలం బొగ్గుపైనే ఆధారపడకుండా లాభదాయకమైన టెక్నికల్ మినరల్స్ తవ్వే ఆలోచనలో ఉన్నామని, రాబోయే 30 ఏళ్లలో మరో 22 మిలియన్ టన్నుల బొగ్గును అదనంగా వెలికితీసేందుకు కొత్త గనులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ.కోటి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నామని, దీంతోపాటు వారసులకు తగిన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు.

ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే ఆగ్రహం..

కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యేగా తన అధ్యక్షతన జరగాల్సి ఉందని, అంతేకాక ఫ్లెక్సీలో తన ఫొటో ముద్రించకుండా ప్రొటోకాల్ విస్మరించారని కూనంనేని సాంబశివరావు సింగరేణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేను కాదని ఏ పనీ చేయొద్దని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కావొద్దని సూచించారు. ఇకనైనా పనితీరు మార్చుకోవాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరామ్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గడిపెల్లి కవిత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు, సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, మిరియాల రంగయ్య, కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసమస్యల పరిష్కారం

- రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: భూ భారతి చట్టం ద్వారా రైతులు, ప్రజలకు సంబంధించి భూసమస్యల దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణపై తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. వీటిని పరిశీలిస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇక ఈనెల 3నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని మిగిలిన అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరగనుండగా, ప్రతీ మండలానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యాన రెండేసి బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీరోజు సదస్సుల నిర్వహణపై నివేదిక ఇస్తూ, దరఖాస్తుదారులకు రశీదు అందించాలని తెలిపారు. కాగా, సదస్సు వేదికల వద్ద హెల్ప్ డెస్కుల ఏర్పాటు, సరిపడా దరఖాస్తులు సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఒకవేళ ఎవరి దరఖాస్తులైనా తిరస్కరిస్తే అందుకు కారణాలు స్పష్టంగా తెలియచేయాలని చెప్పారు. కాగా, ఆర్‌ఎస్‌ఆర్‌పీఓటీ, భూ సేకరణ కేసులు, సరిహద్దు వివాదాలు, పార్ట్ బీ కేసులు, అసైన్డ్ భూముల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈసమావేశంలో ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు జి.నర్సింహారావు, ఎల్.రాజేందర్‌గౌడ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విధుల్లోకి జీపీఏలు

గ్రామ పాలన అధికారులు(జీపీఓ) సోమవారం నుంచి విధుల్లోకి రానున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 382 రెవెన్యూ గ్రామాలు ఉండగా, జీపీఓగా విధులు నిర్వర్తించేందుకు 255మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, పరీక్షకు 225మంది హాజరు కాగా, అందులో 192మంది ఉత్తీర్ణులయ్యారు. వీరికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నియామక పత్రాలు, పోస్టింగ్‌లు ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఆపై 3వ తేదీ నుంచి గ్రామాల్లో జరిగే భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వీరు విధులు నిర్వహించే అవకాశం ఉంది.

ముందుకు సాగలేక.. వెనక్కి వెళ్లలేక



ఖమ్మం బైపాస్ రోడ్డులో శనివారం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వాహనాలు మెల్లగా కదులుతుండడంతో తెలంగాణ తల్లి సర్కిల్ నుంచి చెన్నై షాపింగ్ మాల్ వరకు మూడు గంటల పాటు బారులుదీరాయి. పోలీసులు చేరుకున్నా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి శ్రమించాల్సి వచ్చింది. తెలంగాణ తల్లి సర్కిల్ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం.. ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ లైట్ సమయం తక్కువగా ఇస్తుండగా.. ఐదారు భారీ వాహనాలు మూల తిరిగి వెళ్లేలోగా రెడ్ లైట్ పడుతోంది. ఈ సమస్యతోనే ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని లారీల డ్రైవర్లు వాపోయారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



రామారావును సత్కరిస్తున్న ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో విధులు నిర్వర్తిస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన అధికారులను రీజినల్ మేనేజర్ ఎ.సరిరాం ఖమ్మంలో సన్మానించారు. భద్రాచలం డీఎంగా పనిచేసి, ప్రస్తుతం కార్గో ఏటీఎంగా విధులు నిర్వర్తిస్తున్న రామారావు, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) వీరన్న ఉద్యోగ విరమణ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం డిపో మేనేజర్ దినేశ్‌కుమార్, పర్సనల్ ఆఫీసర్ రామకృష్ణ, ఏట బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పేరిట రుణం తీసుకున్న చైర్మన్



డీసీఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ తమ పేరుపై సొసైటీలో రుణం తీసుకుని చెల్లించలేదని తనగంపాడుకు చెందిన తేజావత్ బాలు, వీరన్న ఆరోపించారు. పట్టాదారు పాస్ బుక్‌లు పెట్టి రుణం తీసుకోగా, తిరిగి చెల్లించాలని కోరితే రుణమాఫీ అవుతుందని నమ్మబలికాడని పేర్కొన్నారు. అయితే, రుణమాఫీ కాకపోగా ప్రస్తుతం అప్పు చెల్లించాలని తమకు నోటీసులు వచ్చాయని వాపోయారు. ఈ మేరకు చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వారు జిల్లా సహకార శాఖ అధికారి, ఖమ్మం రూరల్ సీఐకి ఫిర్యాదు చేశారు.

విద్యుత్ వేసవి ప్రణాళిక విజయవంతం

ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: వేసవి కాలానికి రూపొందించిన విద్యుత్ ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. నవంబర్‌లోనే కార్యాచరణ సిద్ధం చేసి.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంతో వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలిగామని వెల్లడించారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న కొత్తలింగాల, మమతా రోడ్డు, తనికెళ్ల, బత్తులపల్లి, మిట్టపల్లి, జన్నారం, ములుగుమాడు, సత్తుపల్లి సబ్‌స్టేషన్లలో మొత్తం 13 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, ఇల్లెందు క్రాస్, టేకులపల్లి, దానవాయిగూడెం, ప్రకాశ్‌నగర్, ధంసలాపురం, ఖానాపురం, బుర్హాన్‌పురం, వైరా, ఎర్రుపాలెం, లక్ష్మీపురం, జిల్లా ఆస్పత్రి, మర్లకుంట ప్రాంతాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమే కాక అవసరమైన చోట 295 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా ఓవర్ లోడ్ తగ్గిందని తెలిపారు. కాగా, 33 కేవీ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ ఏర్పాటుతో సమస్య ఎదురైన సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ సరఫరా చేయగలిగామని ఎస్‌ఈ వెల్లడించారు. ఇప్పటి వరకు 213.14 కి.మీ. మేర 36 సబ్‌స్టేషన్లకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు.


మత్స్యకార మహిళలకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

కూసుమంచి: పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఆరు జిల్లాల మహిళా మత్స్యకారులకు చేపలు, రొయ్యలతో ఆహార ఉత్పత్తుల తయారీపై ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వారికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశాక నర్సాపురం మత్స్య కళాశాల అసిసియేట్ డీన్ నీరజ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో మత్స్య రంగ అభివృద్ధికి అనువైన అవకాశాలు ఉన్నందున మహిళలు చేపలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. నైపుణ్యాలు పెంచుకుని యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే ఆర్థికంగా ఎదగొచ్చని తెలిపారు. చేపలు, రొయ్యలతో పచ్చళ్లు, ఇతర ఉత్పత్తుల తయారీని కుటీర పరిశ్రమగా కొనసాగించాలని పేర్కొన్నారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఇప్పటి వరకు 4 వేల మంది మత్స్యకారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవీందర్, నాగరాజు, భార్గవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

జీవనంలో సగపాలు

జీవన ప్రమాణాలు మెరుగుపర్చేది పాడిపరిశ్రమ

- పౌష్టికాహారంలో పాలకే ప్రాధాన్యత
- ఉమ్మడి జిల్లాలో మెరుగ్గా పాల ఉత్పత్తి
- త్వరలోనే ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు
- నేడు ప్రపంచ పాల దినోత్సవం

పాలు, పాల ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పాలు ఆరోగ్యకరమన ఆహారం. జీవనోపాధి, సమాజ ప్రయోజనాలకు పాడి పరిశ్రమ ఎంతగానో దోహదపడుతుంది. జీవన ప్రమాణాలను మెరుగుపర్చటంలో పాడి పరిశ్రమ ప్రధాన భూమిక పోషిస్తుందనటంలో సందేహం లేదు. మానవాళి జీవనంలో పాలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఈ నేపథ్యాన నేడు (ఆదివారం) అంతర్జాతీయ పాల దినోత్సవం సందర్భంగా కథనం. –ఖమ్మంవ్యవసాయం



పాల సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

పాల ఉత్పత్తికి పెరుగుతున్న ప్రాధాన్యం

మనిషి ఆరోగ్యం పాల ఉత్పత్తులపై ఆధారపడటంతో ఆయా ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యాన ప్రభుత్వాలు పాడి పరిశ్రమకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వ్యవసాయ పరంగా ముందంజలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమపైనా రైతులు మక్కువ కనబరుస్తునానరు. ఉమ్మడి జిల్లాలో గేదె పాలు ఉత్పత్తి ఎక్కువగా ఉండగా.. ప్రభుత్వం 25 వేల లీటర్ల సామర్థ్యంతో పాడి పరిశ్రమ (విజయ డెయిరీ)ను నిర్వహిస్తోంది. ఖమ్మంలోని ఈ పరిశ్రమకు అనుబంధంగా కామేపల్లి, మధిర, ఎర్రుపాలెం, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెంలలో 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాల శీతలీకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

227 గ్రామాల్లో పాల సేకరణ

పాల శీతలీకరణ కేంద్రాల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 30 మండలాల్లోని 227 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ పాల సేకరణ కేంద్రాల్లో 3,025 మంది ఉత్పత్తి చేసే పాలను విక్రయిస్తున్నారు. ఖమ్మం జిల్లా పాల ఉత్పత్తిదారుల నుంచి ప్రస్తుతం రోజుకు 7,750 లీటర్ల పాలను సేకరిస్తుండగా, కొత్తగూడెం జిల్లా నుంచి 2,500 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఈ మొత్తం నుంచి ఖమ్మం జిల్లాలో 1,000 లీటర్లు, కొత్తగూడెం జిల్లాలో 2,600 లీటర్లు విక్రయిస్తున్నారు. విజయ పాల ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రాధాన్యం ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 6 డెయిరీ పార్లర్లు నడుస్తున్నాయి. వెన్నశాతం ఆధారంగా పాడి పరిశ్రమ రైతుల నుంచి పాలను సేకరిస్తోంది. ప్రభుత్వం ఇటీవల పాల ధరను పెంచింది. 10 వెన్నశాతం ఉన్న గేదె పాల ధరను రూ.80 నుంచి 84.60కు, వెన్నశాతం 7 ఉన్న గేదె పాల ధర రూ.56 నుంచి రూ.59.50లకు పెంచింది.

ఇందిరా డెయిరీతో పెరగనున్న ఉత్పత్తి

రాష్ట్ర ప్రభుత్వం మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. సభ్యులైన మహిళలకు రెండు గేదెల చొప్పున సబ్సిడీపై అందించనున్నారు. మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. ఇప్పటికే ఎర్రుపాలెంలో బల్క్‌మిల్క్ కేంద్రం ఉండగా, బోన కల్, చింతకాని, మధిర, ముదిగొండల్లో ఒక్కో మండలంలో 2,500ల నుంచి 5 వేల సామర్థ్యం కలిగిన బల్క్ మిల్క్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు చేశారు.

ఆరోగ్యం.. శక్తి

పాలలో మన శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, పాస్పరస్, అయోడిన్, ఐరన్, పొటాషియం, ఫోలేట్స్, విటమిన్–ఏ, విటమిన్–డీ, రైబోఫ్లేవిన్, విటమిన్ బీ–12, ప్రోటీన్, హెల్తీ ఫ్యాట్ (ఆరోగ్య కొవ్వు పదార్థాలు) వంటివి ఉంటాయి. అనాదిగా అనేక దేశాలు పాల ప్రాధాన్యాన్ని గుర్తించాయి. నిత్యం సగటున ఒక మనిషికి 274 గ్రాముల పాలు, పాల పదార్థాలు అవసరం. అయితే మన దేశంలో ఒక్కో మనిషికి సగటున 186 గ్రాములు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. పలు ప్రాంతాల్లో 100 గ్రాములకు మించి పాల ఉత్పత్తులు అందటం లేదని నివేదికలు చెబుతున్నాయి.

రైతుల్లో పెరుగుతున్న అవగాహన



పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన పెరుగుతోంది. పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటంతో పాడి పరిశ్రమపై కూడా రైతులు దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు గేదెలను పెంచుకొని, వాటి ద్వారా పాడిని ఉత్పత్తి చేసేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. స్థానికంగా పాలు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా డెయిరీలను ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఖమ్మం జిల్లాలో పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. –మోహనమురళి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్, ఖమ్మం

డెయిరీ ఫలాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

మధిర: ఇందిరా మహిళా డెయిరీ ద్వారా అందే యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ మహిళా లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య సూచించారు. త్వరలో డెయిరీ ఏర్పాటు కానున్న నేపథ్యాన మధిరలోని కార్యాలయంలో శనివారం మహాజనసభ నిర్వహించగా డీఆర్‌డీఓ మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో డెయిరీ ఏర్పాటవుతోందని తెలిపారు. సభ్యత్వం కలిగిన వారికి సబ్సిడీపై రెండు చొప్పున పాడి గేదెలు ఇవ్వనుండగా, ఇప్పటి నుంచే దాణా సేకరణ, గడ్డి పెంపకంపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం డెయిరీలో నిబంధనల సవరణ, నూతనంగా పలువురికి సభ్యత్వం కల్పించడం, ఎర్రుపాలెం మినహా మిగిలిన నాలుగు మండలాల్లో పాలశీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, నూతన పాలకవర్గం ఎన్నిక ప్రతిపాదనలపై చర్చించారు. సమావేశంలో ఏపీఎం జంగం లక్ష్మణ్‌రావుతో పాటు మామిళ్ల శ్రీనివాసరావు, కోటేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, అన్నపూర్ణ, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

‘బడిబాట’ పూర్తయ్యాక సర్దుబాటు చేయాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో బడిబాట కార్యక్రమం పూర్తయ్యాకే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలలు బలోపేతం చేసేలా సర్దుబాటు ఉత్తర్వులు ఉండాలన్నారు. అంతేతప్ప అసంబద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలు పాటించాలనడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ, అమృత్‌కుమార్, రాయల నరసింహారావు, గిలకత్తుల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు లింగం సతీశ్ పాల్గొన్నారు

సర్దుబాటు జీఓను సవరించాలి

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 25లో లోపాలు ఉన్నందున సవరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు – విద్యార్థుల నిష్పత్తి సరిగా లేదని, ఇకనైనా ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, నాయకులు వెంకటేశ్వరరావు, ఉమాదేవి, కోటేశ్వరరావు, గరికె శ్రీను, నాగిరెడ్డి, యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

మహిళ వస్త్రాలు ఎత్తుకెళ్లిన దుండగుడు!



వస్త్రాలు తీసుకుని వెళ్తున్న యువకుడు

నేలకొండపల్లి: ఓ దొంగ రెక్కీ నిర్వహించాడంటే ఆ ఇంట్లో నగలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులు చోరీ చేస్తాడు. కానీ, ఇక్కడ ఓ వ్యక్తి కేవలం మహిళల వస్త్రాలే ఎత్తుకెళ్లడం గమనార్హం. నేలకొండపల్లిలో ఓ మహిళ శనివారం దుస్తులు ఉతికి ఆరుబయట దండెంపై ఆరేసింది. ఆ ఇంటి వద్ద అటూ ఇటు ఓ యువకుడు తిరుగుతుండగా స్థానికులు ప్రశ్నిస్తే సేల్స్‌మేన్‌గా చెప్పుకున్నాడు. ఆ తర్వాత ఇంట్లోకి చొరబడి దండెంపై ఆరేసిన మహిళ వస్త్రాలను బ్యాగ్‌లో పెట్టుకుని పారిపోయాడు. ఈ దృశ్యాలన్నీ ఇంటి ఎదురుగా ఉన్న షాప్ సీసీ కెమెరాలో నమోదయ్యాయి.

మైనర్, డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్లో జరిమానా

ఖమ్మంక్రైం: వాహనాలు నడుపుతూ పట్టుబడిన 34 మంది మైనర్లకు రూ.వెయ్యి చొప్పున, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 75 మందికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన మైనర్లు, మద్యం తాగిన వారిని కోర్టులో హాజరుపర్చగా నాలుగో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (స్పెషల్ మొబైల్) న్యాయమూర్తి బి.నాగమణి జరిమానా విధించారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని విప్పలమడకకు చెందిన అక్కిశెట్టి కృష్ణారావు వైరాలో హమాలీగాపనిచేస్తున్నాడు. పని ముగిశాక ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా తల్లాడ వైపు నుంచి ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కృష్ణారావును పోలీసులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మిషన్ భగీరథ సర్వీసుల తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ల విద్యుత్ సర్వీసులను ఎన్పీడీసీఎల్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఆయా ప్లాంట్ల కనెక్షన్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అంశాలను పరిశీలించారు. ఖమ్మంలోని పలు సర్వీసుల తనిఖీ డీఈ(ఆపరేషన్స్) నంబూరి రామారావు ఆధ్వర్యాన కొనసాగింది.

జిల్లా వ్యాప్తంగా వాన



ఖమ్మంవ్యవసాయం: రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. వాతావరణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం శుక్రవారం ఉదయం 8–30 నుంచి శనివారం ఉదయం 8–30 గంటల వరకు జిల్లాలో సగటున 20.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కారేపల్లి మండలంలో 76.8 మి.మీ.లు, కామేపల్లి మండలంలో 73.4, తల్లాడలో 52.4, ఏన్కూరులో 49.2, పెనుబల్లిలో 38.2, వేంసూరులో 32.2, వైరాలో 20, కల్లూరులో 15.4, సత్తుపల్లిలో 10.6, కొణిజర్లలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైందని నివేదికలో పేర్కొన్నారు.

తప్పుల తడక.. షరా మామూలే

- స్కానింగ్ సెంటర్లపై ఫిర్యాదులొస్తున్నా చర్యలు శూన్యం
- వైద్యులతో పర్సంటేజీ ఒప్పందాలపై విమర్శలు
- నిర్వాహకుల ఇష్టారాజ్యంతో ప్రజల ఇక్కట్లు



ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌లో పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని పలు స్కానింగ్ సెంటర్లలో తప్పులతడకగా రిపోర్టులు ఇవ్వడం, రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. పలుమార్లు ఆందోళనలు జరుగుతుండడం షరామామూలుగా మారింది. పట్టణంలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌కు మే 1వ తేదీన వచ్చిన మహిళను ఎదురుగా ఉన్న ఆస్పత్రికి రిఫర్ చేయటం.. అక్కడ ఆపరేషన్ వికటించి ఆమె మృతి చెందింది. ఈ ఘటన మరువకముందే ఆరు నెలల గర్భిణి అనూషకు తొమ్మిది నెలలు నిండిన జ్యోతి స్కానింగ్ రిపోర్టు ఇవ్వడంతో చికిత్స వికటించింది.

కేసులు నమోదు అవుతున్నా..

గతేడాది ఆల్ఫాస్కానింగ్ సెంటర్‌లో కిడ్నీలో రాళ్లు ఉన్నట్టు తప్పుడు రిపోర్టు ఇవ్వడంతో నష్టపోయానని సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు ఇచ్చాడు. నెల కిందట విద్యుత్‌శాఖ ఉద్యోగి బంధువు కడుపులో ఓవరిస్ సమస్య లేకపోయినా ఉందని నివేదిక ఇవ్వగా, ఖమ్మంలో స్కానింగ్ చేయిస్తే ఇబ్బంది ఏమీ లేదని తేలింది. దీనిపై బాధితుడు స్కానింగ్ సెంటర్ బాధ్యులను నిలదీస్తే తప్పు జరిగిందని అంగీకరించారు.

వైద్యురాలు ఏం చేస్తున్నట్టు..

ఆరు నెలల గర్భిణి రిపోర్టు స్థానంలో తొమ్మిది నెలల గర్భిణి నివేదిక ఇవ్వగా.. పేరు చూడకుండానే డాక్టర్ ఉడతనేని లలితకుమారి మందులు రాయడం గమనార్హం. ఆరు నెలల గర్భిణికి తొమ్మిది నెలల గర్భిణికి సంబంధించిన మందులు రాయడంతో ఆమె అస్వస్థతకు గురవడం చర్చనీయాంశమైంది. గతంలో ఇదే ఆస్పత్రిలో వైద్యం వికటించి ఓ బాలింత మృతి చెందగా సర్దుబాటు చేసుకున్న విషయం విదితమే.

పర్సంటేజీలతోనే స్కానింగ్

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే స్కానింగ్‌కు పంపించటం కొందరికి అనవాయితీగా మారింది. ప్రతీ స్కానింగ్‌లోనూ వైద్యులకు, స్కానింగ్ సెంటర్ నడుమ పర్సంటేజీల వ్యవహారం ఉండడంతోనే ఇలా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్తుపల్లిలోని కొందరు వైద్యులకు ఇది నిత్యకృత్యంగా మారిందని చెబుతున్నా సత్తుపల్లిలో రెండు స్కానింగ్ సెంటర్లు ఉన్నా ఒకే సెంటర్‌కు రిఫర్ చేస్తుండడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది.

రెన్యూవల్ కాకున్నా..

ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌కు 2023 వరకు మాత్రమే అనుమతి ఉండగా.. రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్నటికీ అనుమతి రాలేదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారాం శనివారం చేపట్టిన తనిఖీల్లో తేలింది. అంతేకాక ఏ పరీక్షకు ఎంత రుసుమో తెలిపే బోర్డు కూడా ఏర్పాటుచేయకుండా ఇష్టారీతిన వసూలు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. స్కానింగ్ సెంటర్‌లో రిపోర్టులు తారుమారైన ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం, లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యులు చింతా కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రిపోర్టులు మారిన తర్వాత వైద్యం చేయడంపై డాక్టర్ లలితకుమారిని కూడా ప్రశ్నించామని తెలిపారు. పేర్లు చూడకుండా వైద్యం చేసిన నేపథ్యాన వివరణ తీసుకున్నామని చెప్పారు. అలాగే, స్కానింగ్ సెంటర్‌లో సక్రమంగా వ్యవహరించడమే కాక పరీక్షల ధరలతో బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులు ప్రవేశపెట్టడంతో పాటు ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల వెలువరించిన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. అంతేకాక అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు నూతన ఆవాసాల్లో పాఠశాలలు ప్రారంభించాలన్నారు. వందలాదిగా సబ్జెక్టు టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యాన అర్హులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని, కాలయాపన చేయకుండా పెండింగ్ టీఏలు, పీఆర్సీ విడుదల చేయాలని రవి డిమాండ్ చేశారు. అంతేకాక పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులకు సరైన వేతనం చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు బుర్రి వెంకన్న, షమీ, రాంబాబు, ఉద్దండ్ షరీఫ్, ప్రసాద్‌రావు, వీరస్వామి, వీరబాబు పాల్గొన్నారు.

కేన్సర్‌తో పోరాడి ఓడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



సత్యగోపాల్ (ఫైల్)

రఘునాథపాలెం: కేన్సర్‌ను తుది దశలో గుర్తించినా, ధైర్యంగా చికిత్స చేయించుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన పోరాటంలో ఓడిపోయారు. మండలంలోని కోయచలకు చెందిన మాదంశెట్టి సత్యగోపాల్ (34) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవారు. ఆయనకు కేన్సర్ సోకినట్లు తెలియడంతో మూడేళ్లుగా కీమోథెరపీ చేయించుకుంటున్నారు. అయినా ఫలితం లేక శనివా రం ఉదయం మృతి చెందాడు. కాగా, సత్యగోపాల్ సోదరుడు రాంబాబు అన్న కోసం ఉద్యోగం వదిలిపెట్టి చికిత్సకు చేయూతగా నిలవగా, చివరకు సోదరుడు కన్నుమూయడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు సత్యగోపాల్ అంత్యక్రియలకు కుటుంబీకులు, స్థానికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మృతి

వైరారూరల్: వైరా సమీపాన బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీడ్రైవర్ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఇనుప చువ్వల లోడుతో వైరా వైపు నుంచి తల్లాడ వైపు లారీ వెళ్తుండగా డీసీఎం వ్యాన్‌ను, ఆ తర్వాత కారును ఢీకొన్న విషయం విదితమే. ఈ ఘటనలో లారీడ్రైవర్ షేక్‌మహబూబ్ సుభానీ అలియాస్ మున్నా(32)కు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. ఆయన స్వగ్రామం విజయవాడ కాగా భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

వేంసూరు: అప్పుల పెరగడం, ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేంసూరు మండలం వెంకటాపురానికి చెందిన షేక్ నాగుల్‌మీరా (37) భార్యతో కలిసి చికెన్ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో అప్పులు పెరిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. శనివారం నాగుల్‌మీరా భార్య షాకీనా ఆస్పత్రికి వెళ్లగా ఆయన ఉరి వేసుకున్నాడు. ఇంటికి వచ్చిన కుటుంబీకులు గుర్తించి సత్తుపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా, ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని సుద్దవాగుతండాకు చెందిన బానోతు శ్రీనివాస్(42) మోటార్‌సైకిల్‌పై శనివారం రాత్రి సోలీపురం నుంచి కాకరవాయి వస్తుండగా కింద పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, శ్రీనివాస్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టిందా లేదా గేదెను తగిలి పడ్డాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య బుజ్జితో పాటు ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

బోనకల్: మండలంలోని రావినూతలలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏడుగురిపై కేసు నమోదుచేసి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పి.వెంకన్న తెలిపారు.